పదింతల సాధన

- పదిలో వంద శాతం ఫలితాల కోసం ప్రణాళికలు
- మార్చి 17 నుంచి పబ్లిక్ పరీక్షలు
- ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు
- వెనుకబడిన విద్యార్థులపై దృష్టి

చాగల్లు: విద్యార్థి దశ దిశను నిర్దేశించే పదో తరగతి పరీక్షలు దగ్గరపడ్డాయి. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పదిలో మెరుగైన ఫలితాలు సాధనే లక్ష్యంగా చేపట్టిన వంద రోజుల ప్రణాళిక డిసెంబర్ నుంచి అమలు చేస్తున్నారు. వార్షిక పరీక్షలకు కేవలం మరో 34 రోజులు మాత్రమే ఉండడంతో మరింత ప్రత్యేక శ్రద్ధతో తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతి ఉపాధ్యాయుడు అయా సబ్జెక్ట్‌లో విద్యార్థులకు అర్థమయ్యేలా సులభతరంగా బోధిస్తూ, సందేహాలను నివృత్తి చేస్తూ మంచి వాతావరణాన్ని కల్పిస్తున్నారు.

ప్రత్యేక తరగతులు, స్లిప్ టెస్టులు

టెన్త్ విద్యార్థులకు వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు ఇప్పటికే 100 రోజుల ప్రణాళిక అమలు చేస్తుండగా, వార్షిక పరీక్షలు మరో 34 రోజులే ఉండడంతో దీనిని మరింత పకడ్బందీగా అమలు చేసేందుకు ఉపాధ్యాయులు కూడా పనిచేస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు, మళ్లీ సాయంత్రం 4 గంటల నుంచి 5.30 గంటల వరకు ప్రత్యేక తరగతులు, స్టడీ అవర్స్, స్లీప్ టెస్టులు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక పరీక్షల్లో విద్యార్థులకు వచ్చిన మార్కులకు ఆధారంగా వారిని గ్రూపులుగా విభజించి సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి, మెళకువలు నేర్పి వారిని కూడా ఏ గ్రేడ్ విద్యార్థులుగా తీర్చిదిద్దడంపై ఉపాధ్యాయులు దృష్టి సారించారు. అదేవిధంగా గతంలో క్లాసుల్లో బోధించిన పాఠశాల సబ్జెక్టుల వారీగా రివిజన్ చేయిస్తున్నారు. కాగా అధిక శాతం పాఠశాలల్లో సబ్జెక్ట్ వారి ఉపాధ్యాయుల కొరత విద్యార్థులను వేధిస్తుండగా ఇతర సబ్జెక్టుల ఉపాధ్యాయులు వాటిని బోధిస్తున్నారు. కొవ్వూరు నియోజకవర్గంలో కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి మండలాల్లో మొత్తం ప్రభుత్వ, జెడ్పీహైస్కూల్‌లు 26 ఉన్నాయి. వీరిలో సుమారు 2600 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

మార్చి 17 నుంచి పరీక్షలు

పదో తరగతి పరీక్షలు మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నారు. సోషల్ పరీక్ష మార్చి 31వ తేదీతో పూర్తి అవుతుంది. ఇప్పటికే ప్రభుత్వం పరీక్షల షెడ్యూల్‌ని విడుదల చేసింది. గతేడాది విద్యా సంవత్సరంలో మాదిరిగానే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఏడు పేపర్లుగా నిర్వహించనున్నారు. ప్రతి పరీక్షకు మధ్య ఒక రోజు విరామం ఇవ్వడంతో విద్యార్థులకు కొంత మేరకు విశ్రాంతి లభించినట్లయింది.



చాగల్లు జెడ్పీ హైస్కూల్‌లో స్టడీ అవర్స్‌లో విద్యార్థులు

మంచి ర్యాంక్ లక్ష్యంగా సాధన



పాఠశాలలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం నిర్వహించే స్టడీ అవర్స్ ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. స్టడీ అవర్స్‌లో ఉపాధ్యాయులు సబ్జెక్టుల్లో ఏవైనా అనుమానాలు ఉంటే అప్పుడే నివృత్తి చేస్తున్నారు. టాప్ ర్యాంక్ లక్ష్యంగా కష్టపడి చదువుతున్నాం.

–బి.గ్రేష్మా, విద్యార్థిని, చాగల్లు

సిలబస్ రివిజన్‌కు అవకాశం



ఉదయం, సాయంత్రం రోజుకు ఒక్క సెబ్జెక్టు చొప్పున ప్రత్యేక తరగతులతో సిలబస్ రివిజన్‌కు అవకాశం ఏర్పడింది. ప్రత్యేక తరగతులతో పాఠశాలలో ఎక్కువ సమయం ఉండడం వల్ల ఆయా సబ్జెక్టుల టీచర్లు అందుబాటులో ఉంటున్నారు.

–జి.లక్ష్మీప్రసన్న, విద్యార్థి, చాగల్లు

గ్రూపులుగా విభజించి..



ఉపాధ్యాయులు విద్యార్థులను గ్రూపులుగా విభజించి ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి చదివిస్తున్నాం. దీని వలన విద్యార్థి అభ్యసన స్థితి ఉపాధ్యాయుడికి అర్థమై వెంటనే సబ్జెక్టు వారీగా కూడా విద్యార్థులకు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. విద్యార్థి అన్ని సబ్జెక్టుల్లో నిష్ణాతుడై ఉత్తమ ఫలితాలు సాధించేందుకు దోహదపడుతుంది..

–వి.మోహన్ కృష్ణ, ఇన్‌చార్జి హెచ్‌ఎం, జెడ్పీహైస్కూల్, చాగల్లు

నూరుశాతం కోసం ప్రత్యేక దృష్టి



పది పరీక్షల ఫలితాల్లో ప్రతి ప్రభుత్వ పాఠశాల నూరుశాతం ఫలితాలు సాధించే దిశగా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు 100 రోజుల ప్రణాళికను కచ్చితంగా అమలు చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం నిర్వహిస్తున్న స్టడీ అవర్స్ విద్యార్థులకు ఎంత గానో ఉపకరిస్తున్నాయి. నూరుశాతం ఫలితాలను సాధించే దిశగా పనిచేస్తున్నాం.

– యు.గురునాథం, ఎంఈఓ, చాగల్లు

క్లుప్తంగా

గ్రామాల్లో అన్నసమారాధన

తాళ్లపూడి: వేగేశ్వరపురంలోని వడ్డీల రామాలయం వద్ద ఆలయ నాలుగో వార్షికోత్సవం సందర్భంగా బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు, దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ అన్నసమారాధనలో సుమారు 3 వేల మంది పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ప్రక్కిలంకలో..

ప్రక్కిలంక గ్రామదేవత మావుళ్లమ్మ తల్లి ఆలయం వద్ద పౌర్ణమి సందర్భంగా గోదావరి జాలాలతో అభిషేకాలు చేశారు. ప్రత్యేక హోమాలు నిర్వహించారు. దాతల సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేసి, అమ్మవారికి దాతలు అందజేసిన ఆభరణాలతో అలంకరించారు. అనంతరం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామివారి చక్రస్నానంలో పాల్గొన్న భక్తులు

నిడదవోలు: పట్టణంలోని బసివిరెడ్డిపేటలో పశ్చిమడెల్టా ప్రధాన కాలువ ఒడ్డున వేంచేసి ఉన్న అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో 50వ కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల వేదమంత్రోచ్చారణల మధ్య కాలువ రేవులో చక్రస్నానం నిర్వహించారు. పట్టణ నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారికి పూజలు చేశారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

తిమ్మరాజుపాలెంలో విషాదఛాయలు

నిడదవోలు రూరల్: రాజమహేంద్రవరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తిమ్మరాజుపాలెం గ్రామానికి చెందిన భీమడోలు దయామణి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. తిమ్మరాజుపాలెంకు చెందిన పాస్టర్ భీమడోలు మనోహరం, ఆయన భార్య దయామణి కలిసి బైక్‌పై వివాహానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొని ఆమె మృతి చెందగా, పాస్టర్ మనోహరానికి తీవ్రగాయాలయ్యాయని బంధువులు తెలిపారు. ఈ విషాదంతో తిమ్మరాజుపాలెం గ్రామంతో పాటు వారు పరిచర్య చేసే సమిశ్రగూడెం లోహియనగర్‌లోని సంఘ విశ్వాసులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన ర్యాలీ



వేళ్లచింతలగూడెం ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులు నిర్వహిస్తున్న ర్యాలీ

గోపాలపురం: ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలు వివరిస్తూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. వేళ్లచింతలగూడెం ఎంపీయూపీ పాఠశాల వద్ద బుధవారం ఎన్రోల్‌మెంట్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న మధ్యాహ్న భోజనం, ఉచిత దుస్తులు, బ్యాగులు, పాఠ్యపుస్తకాలు, ఇంగ్లిష్ మీడియం విద్య వంటి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎన్‌సీహెచ్ రత్నకుమారి, రత్నమణి, సీఆర్పీ కొయ్య నాగరాజు, విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కట్నం వేధింపులపై కేసు

కొవ్వూరు: పట్టణంలో ఇందిరమ్మ కాలనీకి చెందిన వల్లూరి కామాక్షి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె భర్త, అత్త మామలపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై కె.జగన్‌మోహన్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కామాక్షికి రాజమహేంద్రవరానికి చెందిన వెంకటేశ్వరరావుతో 2010లో వివాహమైంది. పెళ్లి సమయంలో ఇచ్చిన కట్నకానుకలు కాకుండా అదనంగా కట్నం తీసుకురావాలంటూ తనను శారీరకంగాను, మానసికంగాను వేధింపులకు పాల్పడుతున్నారని ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు ఆమె భర్తతో పాటు అత్తమామలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మహిళను బెదిరించిన ముగ్గురిపై కేసు

కొవ్వూరు: పట్టణానికి చెందిన సింగులూరి జగదీశ్వరితో అసభ్యకరంగా ప్రవర్తించి ఆమెను కొట్టి, ఆమె భర్తను చంపుతామని బెదిరించిన ముగ్గురిపై ఇచ్చిన ఫిర్యాదుపై బుధవారం కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్సై కె.జగన్‌మోహన్‌రావు తెలిపారు. ఈనెల 9వ తేదీ రాత్రి అంకోలు విజయ్‌కుమార్ తనకు ఫోన్ చేసి తన భర్తను చంపేస్తామని, రౌడీలతో కొట్టిస్తానని బెదిరించినట్టు జగదీశ్వరి ఫిర్యాదులో పేర్కొంది. పదో తేదీ తెల్లవారుజామున అంకోలు శ్యాంపవన్, విజయ్‌కుమార్, చందు ముగ్గురు తన ఇంటికి వచ్చి తలుపులు కొట్టి గొడవపడ్డారన్నారు. ఈ సమయంలో తన చాతిపై చేయి వేసి నెట్టి, కాళ్లతో తన్నినట్లు తెలిపింది. ఈ మేరకు ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

పాడి రైతుల సంక్షేమానికి కృషి

కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చెలసాని ఆంజనేయులు



వజ్రోత్సవ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న చైర్మన్ చెలసాని ఆంజనేయులు

నల్లజర్ల: రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఒకే ఒక్క సంస్థ కృష్ణామిల్క్(విజయ)యూనియన్ మాత్రమేనని ఆ సంస్థ చైర్మన్ చెలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. సంస్థ స్థాపించి 60 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ సంస్థ ఆధ్వర్యంలో నల్లజర్లలో బుధవారం అల్లాడ రామయ్య కల్యాణ మండపంలో వజ్రోత్సవాలను నిర్వహించారు. రైతులతో కలసి భారీ కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పాడి రైతుకు మరింత అండగా నిలిచేలా కృషి చేస్తామన్నారు. సంస్థ 60 ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో ఆటుపోట్లు తట్టుకొని సహకార వ్యవస్థలో దేశంలోనే అగ్రగామిగా నిలిచిందన్నారు. రైతులు, వినియోగదారుల నమ్మకం నిలబెట్టుకుంటూ ఉద్యోగుల అండతో రాబోయే రోజులలో మరిన్ని మెరుగైన ఫలితాలు సాధిస్తామన్నారు. రైతులంతా నాణ్యమైన పాలు ఉత్పత్తి చేసి అత్యధిక లాభాలు పొందాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా పాల సంఘాల అధ్యక్షులను శాలువాలతో సత్కరించారు. ఎండీ కొల్లి ఈశ్వరబాబు, పాలరైతుల జిల్లా అధ్యక్షుడు గంటా నాగేశ్వరావు, నందమూరి రామకృష్ణ, డైరెక్టర్లు దాసరివెంకట బాలవర్ధనరావు, అర్జా వెంకటనగేష్, బొట్టు రామచంద్రరావు, నెక్కలపూడి వాణిశ్రీ, వెంకటశివజ్యోతి, ఏజీఎం అన్వేష్‌కుమార్, మేనేజరు బి.మూర్తి, పెండ్యాల వీరరాఘవులు, అల్లూరి శ్రీనివాసరావు, మేణ్ణి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ర్యాంపు ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ



తాడిపూడి సమావేశంలో పాల్గొన్న ఆర్డీవో రాణీసుస్మిత, ఇతర అధికారులు

తాళ్లపూడి: గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసే ఇసుక ఓపెన్ ర్యాంపు వల్ల తమకు ఇబ్బందులు ఏర్పడుతుందని, అయితే పంచాయతీకి ఆదాయం వచ్చేలా చేస్తేనే అంగీకరిస్తామని లేకుంటే లేదని సర్పంచ్ నామా శ్రీనివాస్, గ్రామస్తులు స్పష్టం చేశారు. తాడిపూడిలో బుధవారం గ్రామ పంచాయతీ వద్ద కొత్తగా ఓపెన్ ఇసుక ర్యాంపు ఏర్పాటు చేయడానికి కొవ్వూరు ఆర్డీఓ డాక్టర్ రాణీసుస్మిత అధ్యక్షతన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. తాడిపూడి ఓపెన్ రీచ్ 49.33 హెక్టార్లలో సంవత్సరానికి 4,93,300 క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇచ్చేందుకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి కాకినాడ ఆధ్వర్యంలో జరిగిన అభిప్రాయ సేకరణలో 12 మంది వరకు గ్రామస్తులు, ఎన్‌జీవోలు తమ అభిప్రాయాలను తెలిపారు. ర్యాంపు నిర్వాహణలో తీసుకోవాల్సిన నింబంధనలు, సమగ్ర సమాచారాన్ని ఎస్‌వీఎన్విరో ప్రతినిధి ఎన్.రామలింగయ్య చదివి వినిపించారు. ప్రజల నుంచి అభ్యంతరాలను ఆర్డీవో కోరారు. గ్రామ సర్పంచ్ నామా శ్రీనివాస్ గ్రామ పంచాయతీకి ర్యాంపు వల్ల ఆదాయం వచ్చేలా చూడాలన్నారు. ఇసుక గ్రామానికి ఉచితంగా ఇవ్వాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కమిటీ నుంచి జేపీ రామారావు మాట్లాడుతూ తవ్వకాలకు సంబంధించి వివరాలు, ధరలు, అక్రమ ఇసుక తవ్వకాలు చేస్తే ఫిర్యాదు చేయడానికి టోల్ ఫ్రీ నంబర్ బోర్డులు పెట్టాలని కోరారు. మాజీ సర్పంచ్ భీమరాజు, సిద్ధన రాధాకృష్ణ, వీరిశెట్టి రాంబాబు, కొలుకుల అబ్బులు, అక్కాబత్తుల కరుణాకర్, సత్యనారాయణ, నామా ప్రకాశం, నామా సురేంద్ర, గగ్రే కిశోర్ తదితరులు అభిప్రాయాలను తెలిపారు.

ప్రక్కిలంకలో

ప్రక్కిలంక పంచాయతీ వద్ద కోనేరు రంగారావు కమిటీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.సతీష్ అధ్యక్షతన ఇన్‌చార్జి తహసీల్దార్ మోహన భారతి ఆధ్వర్యంలో ప్రక్కిలంక లో ఏసెన్ ఇసుక ర్యాంపు 47 హెక్టార్ల పరిధిలో 4.70 లక్షల క్యూబిక్ మీటర్ల మేర ఇసుక తవ్వకాలకు కూడా పర్యావరణ అభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు. గ్రామస్తుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ సమావేశాల్లో మైన్స్ ఏడీ బి.ఫణిభూషన్‌రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శంకర్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ భారతి, ఆర్ఐ కె.రామకృష్ణ, గ్రామానికి చెందిన నాయకులు యాళ్ల బాబూరావు, కొప్పాక కోటేస్, ఇందుగుల రామకృష్ణ, పోసిబాబు తదితరుల పాల్గొన్నారు.

అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి



దొండపూడిలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతు కూలీసంఘం, ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు

గోపాలపురం: అటవీ హక్కుల చట్టం 2005ను పటిష్టంగా అమలు చేయాలని, అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు 1/70 చట్టాన్ని సవరిస్తానని వ్యాఖ్యానించడంపై ఏజెన్సీ గిరిజన సంఘం, రైతు కూలీసంఘం నాయకులు బుధవారం దొండపూడిలో ధర్నా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు మాట్లాడుతూ ఇటీవల విశాఖ పట్నంలో జరిగిన టూరిజం సదస్సులో ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అటవీ హక్కుల చట్టాన్ని సవరిస్తామని చెప్పడంలో అడవుల్లో కొండల్లోని ఖనిజ సంపదను దోపిడీ శక్తులకు కట్టబెట్టే కుట్ర పాలకులు చేయడం సిగ్గుచేటన్నారు. రైతుకూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్‌కే భాషా మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టీడీపీ అడవులను, కొండలను, ఖనిజ సంపదలను కార్పొరేట్ శక్తులకు, పెట్టబడిదారులకు అప్పగించడం కోసం స్పీకర్ అయ్యన్నపాత్రుడితో వ్యాఖ్యానిస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు సవలం రాంబాబు, దాడి రాముడు, కె.సింగరాజు, మడకం పోశమ్మ రైతుకూలీ సంఘం, ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి



పోలింగ్ స్టేషన్లను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సెక్రటరీ, జిల్లా కలెక్టర్

పెరవలి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం కేటాయించిన పోలింగ్ స్టేషనల్లో అన్ని సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ సెక్రటరీ సునీత ఆదేశించారు. పెరవలిలో ఏర్పాటు చేసిన 3 పోలింగ్ కేంద్రాలను బుధవారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓట్లు వేయడానికి వచ్చిన ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. పెరవలి మండలంలో ఎంత మంది ఓటర్లు? ఎన్ని పోలింగ్ బూతులు ఏర్పాటు చేశారని అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ బూతులను పరిశీలించిన అనంతరం సంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలో పట్టబద్రుల ఓటర్లు 1927 మంది ఉన్నారని వీరిలో పురుషులు 1110 మంది, స్రీలు 817 మంది ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో సీతారామమూర్తి, ఆర్డీఓ రాణీ సుస్మిత, తహసీల్దార్ డి.అచ్యుతకుమారి, ఆర్ఐ పావని, రెవెన్యూ, పోలీస్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లస్ టూ పాఠశాలలను కళాశాలలుగా మార్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్

కొవ్వూరు: ప్లస్ టూ పాఠశాలలను జిల్లా పరిషత్ జూనియర్ కళాశాలలుగా నిర్వహించాలని ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం కొవ్వూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్‌టీయూ రీజనల్ కన్వీనర్ ఏ ఆంజనేయరాజు అధ్యక్షతన రీజనల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలన్నారు. ప్రావిడెంట్ ఫండ్, సరెండర్ లీవ్‌లు, పీఎఫ్ పాక్షిక రుణాలు, పెండింగ్‌లో ఉన్న డీఏలు, 11వ పీఆర్సీ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేసి 30 శాతం ఐఆర్ ప్రకటించాలని కోరారు. ఇప్పటికే ఎనిమిది నెలలు ఆలస్యమైందని, ప్లస్ టూ పాఠశాలలను జిల్లా పరిషత్ జూనియర్ కళాశాలలుగా మార్పు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు పదోన్నతిలో భాగంగా పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లుగా నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా శాఖ అధ్యక్షుడు డేనియేలు బాబు, రీజియన్ పరిధిలో ఉన్న ఎస్‌టీయూ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వంద రోజుల పని కల్పించాలి

రాజమహేంద్రవరం రూరల్: ఉపాధి హామీ కూలీలకు వంద రోజులు పని కల్పించడానికి ఫీల్డ్ అసిస్టెంట్లు కృషి చేయాలని డ్వామా పీడీ నాగమహేశ్వరరావు ఆదేశించారు. హుకుంపేట మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం రాజానగరం, కడియం, రాజమహేంద్రవరం రూరల్ మండలాల ఫీల్డ్ అసిస్టెంట్లకు సాంకేతిక అంశాలపై శిక్షణ నిర్వహించారు. పీడీ నాగ మహేశ్వరరావు మాట్లాడుతూ చెరువులు, కాలువలు, ఫార్మ్‌పాండ్స్, చేపల చెరువుల్లో కొలతల ప్రకారం పని చేయించి, దినసరి వేతనం రూ.300 వచ్చేలా చూడాలన్నారు. డ్వామా ఏపీడీ రామప్రసాద్, ఏపీవో సత్యవతి, జిల్లా రిసోర్స్‌పర్సన్లు వైబీఎస్ రాజేష్, చక్రవర్తి పాల్గొన్నారు.

సమస్యలను సకాలంలో పరిష్కరిస్తాం

జేసీ చిన్నరాముడు వెల్లడి



కొవ్వూరులో అర్జీదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న జేసీ చిన్నరాముడు

కొవ్వూరు: రీ సర్వే ప్రక్రియలో భాగంగా భూ హక్కుదారుల అర్జీలను త్వరితగతిన పరిష్కరించి సరైన ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ఆర్డీవో కార్యాలయంలో కొవ్వూరు మండలానికి చెందిన ఎనిమిది మంది లబ్ధిదారులకు సరి చేసిన ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఈ సందర్భంగా జేసీ చిన్న రాముడు మాట్లాడుతూ అర్జీదారులు సంతృప్తి చెందేలా రెవెన్యూ సర్వేకి సంబంధించిన వివరాలు సరి చేసి వ్యక్తిగతంగా అందజేస్తున్నామన్నారు. ప్రజల నుంచి వస్తున్న అర్జీలలో 90 శాతం రెవెన్యూ అనుబంధ అర్జీలే అందుతున్నాయన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అర్జీదారుల సమస్యలను క్షేత్రస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి సమస్యలు త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించారు. దీనిలో భాగంగానే కొవ్వూరులో ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఎల్పీ నంబర్, విస్తీర్ణం, పట్టా, రెగ్యులర్ ఖాతా మార్పు తదితర వివరాలను సరిచేసి వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించామన్నారు. అర్జీదారుల సమస్యల పరిష్కారం కోసం జిల్లా యంత్రాంగం చొరవను స్వాగతిస్తున్నామన్నారు. తహసీల్దార్ ఎం.దుర్గా ప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బర్డ్ ఫ్లూతో హడలిపోతున్న ప్రజలు



కానూరు అగ్రహారంలో వీధుల వెంట సోడియం క్లోరైడ్ పిచికారీ చేయిస్తున్న వైద్య బృందం

పెరవలి: కోళ్లకు బర్డ్‌ఫ్లూ రావడంతో ప్రజలను బెంబేలెత్తిపోతున్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులను కోరుతున్నారు. కానూరు అగ్రహారంలో 144 సెక్షన్ విధించడంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలక్షేపం చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఆదేశాల ప్రకారం స్థానిక రెవెన్యూ, పోలీస్, పంచాయతీ వైద్యాధికారులు అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ తమ విధులు నిర్వర్తిస్తున్నారు. కోళ్ల ఫారాల వద్ద, గ్రామంలో వీధులు, ఇళ్ల వద్ద బ్లీచింగ్, సోడియం క్లోరైడ్ పిచికారీ చేస్తున్నారు. కానూరు అగ్రహారం నుంచి 10 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాల్లో మాంసాహారాలు అమ్మకాలు, కొనుగోలుపై నిషేదం విధించడంతో దుకాణాలు మూతపడ్డాయి. పంచాయతీ, రెవెన్యూ అధికారులు పరిసరాలను శుభ్రం చేస్తూ, మాంసం దుకాణదారులకు, హోటల్స్‌కు నోటీసులు ఇవ్వడంతో పూర్తిగా హోటల్స్ శాఖాహార భోజనాలు మాత్రమే అందిస్తున్నారు. దీనితో కొందరు ఇబ్బందులు పడినా ప్రజల ఆరోగ్యం కోసం ఈ నిర్ణయాలు తీసుకున్నామని అధికారులు వెల్లడిస్తున్నారు. బర్డ్‌ఫ్లూ మనుషులకు, జంతువులకు సోకకుండా ముందస్తుగా జీవాలకు వాక్సిన్‌లు వేయటం ప్రారంభించారు, మనుషులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా వైద్యం అందించటానికి వైద్య బృందాలు ఉన్నాయి.

గ్రామాల్లో విస్తృత ప్రచారం

నిడదవోలు రూరల్: కోళ్లకు బర్డ్ ఫ్లూ ప్రబలుతున్న నేపథ్యంలో గ్రామాల్లోని అధికారులు అప్రమత్తమయ్యారు. నిడదవోలు మండలంలోని సమిశ్రగూడెం, గోపవరం, డి.ముప్పవరం తదితర గ్రామాల్లో చికెన్, కోడి గుడ్లు తినొద్దంటూ మైక్, టాంటాం ద్వారా బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో చికెన్ షాపులు మూతబడ్డాయి. చికెన్ షాపులు వద్ద ప్రత్యేక క్లోరినేషన్ చేస్తున్నట్లు సమిశ్రగూడెం పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా కలెక్టర్ తదుపరి ఆదేశాలు వచ్చేవరకు చికెన్, కోడిగుడ్లు విక్రయాలు పూర్తిగా నిషేధించాలని ప్రజలకు సూచించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

నిడదవోలు : పట్టణంలో తీరుగూడెంలోని టిడ్కో గృహ సముదాయం వద్ద నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ పనుల నిమిత్తం గురువారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు నిడదవోలు ఈపీడీసీఎల్ ఈఈ ఎన్.నారాయణ అప్పారావు తెలిపారు. తీరుగూడెం, సింగవరం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు.

కొవ్వూరులో షూటింగ్ సందడి



కొవ్వూరు లాంచీల రేవు వద్ద సినీ నటుడు రావు రమేష్‌పై సన్నివేశాన్ని తెరకెక్కిస్తున్న దృశ్యం

కొవ్వూరు: పట్టణంలో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. పట్టణంలో లాంచీల రేవుల వద్ద బుధవారం మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై తెరకెక్కిస్తున్న సినిమాలోని కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. రామ్ పోతినేని హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి మహేష్ బాబు.పి దర్శకత్వం వహిస్తున్నారు. హీరో చిన్నతనంలో సన్నివేశాలను కొవ్వూరులో తీస్తున్నారు. రావు రమేష్, బ్రహ్మానందం, హర్షవర్ధన్ వంటి నటులు నటిస్తున్నారు. ఈ సినిమాకు వివేక్ మెర్విన్ సంగీత దర్శకత్వం వహిస్తుండగా భాగ్యశ్రీ బోర్‌షా హీరోయిన్‌గా నటిస్తున్నట్టు యూనిట్ సభ్యులు తెలిపారు. స్థానికులు పెద్ద సంఖ్య వచ్చి షూటింగ్ సన్నివేశాలను తిలకించారు.